క్లుప్తంగా

భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బోనకల్: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించారు. స్పందించిన భట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ రాష్ట్ర సభ్యుడు పైడిపల్లి కిషోర్, జెడ్పీటీసీ సభ్యుడే మోదుగు సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కోత

వైరా: పార్లమెంట్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగం, ఆహార భద్రతకు 8శాతం కోత విధించారని విద్య, వైద్యం, సంక్షేమంపై తగ్గింపులు ప్రజలపై పెను భారాలను మోపనున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ.. వినూత్న ఆవిష్కరణల ముసుగులో లక్షల కోట్ల రూపాయలు ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలకు దోచి దుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి చంద్రశేఖరబాబు, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, మందడపు రామారావు, పారుపల్లి కృష్ణారావు, అమరేంద్ర, వడ్లమూడి మధు, గుత్తా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రవేశ పరీక్ష

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని గురుకుల బాలికల కళాశాలలో ఆదివారం 2024–25 సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు నిర్వహించిన సీఓఆర్ ఎంట్రన్స్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు గానూ మొత్తం 300 మంది అభ్యర్థులు హాజరవ్వాల్సి ఉండగా అందులో 286మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి తెలిపారు. పరీక్షల నిర్వహణకు పూర్తిస్థాయిలో ఎస్సై ఎం.సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

ముగిసిన రక్షణగిరి పుణ్యక్షేత్రం తిరునాళ్లు



అయ్యవారిగూడెంలో ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో గత మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రక్షణగిరి పుణ్యక్షేత్రం తిరునాళ్లు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు విశాఖపట్నం అగ్రపీఠం సుపీరియర్, డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ వీసీ మరియదాస్ సంఘస్తులకు క్రీస్తు సందేశమిచ్చారు. పలువురి క్రైస్తవ గురువులతో కలిపి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ సూరేపల్లి ఐజాక్, ఫాదర్లు సంఘస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న యువసేన సభ్యులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు యువసేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ ఎంవీ రామచంద్రరావు సహకారంతో పరీక్ష ప్యాడ్లను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్, వెంకి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మృతికి నివాళి

కొణిజర్ల: కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న భూక్యా లాల్‌చంద్ ఆదివారం ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆయన గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. లాల్‌చంద్ మృతి పట్ల ఎస్సై శంకరరావు, సిబ్బంది తీవ్ర సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా పోలీస్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు అంత్యక్రియలకు హాజరై తక్షణ సాయం కింద మృతుని కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన రావలసిన అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి కుటుంబానికి అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

‘పది’ పరీక్షలకు సన్నద్ధం

- వందశాతం ఫలితాలు లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక
- ఇంకా 43 రోజులే గడువు
- నిత్యం రెండున్నర గంటల పాటు తర్ఫీదు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు కృషి



పాలడుగు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

వైరారూరల్: పదో తరగతి పరీక్షల నిర్వాహణకు మరో 43 రోజుల కాల వ్యవధి మాత్రమే ఉన్న నేపథ్యాన.. ప్రైవేట్‌కు ధీటుగా సర్కారు బడుల్లో ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక రచించింది. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పదో తరగతే పునాది కావడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడమే కాకుండా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టులుగా వారీగా తార్ఫీదు అందిస్తూ.. వందశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలంలో ఇలా..

వైరా మండలంలో 9 హైస్కూల్స్, 4 రెసిడెన్షియల్ పాఠశాలలు కలిసి మొత్తం 13 సర్కారు బడులు ఉండగా ఇందులో మొత్తం 10వ తరగతి చదివే విద్యార్థి, విద్యార్థినులు 720 మంది ఉన్నారు. అన్ని సర్కారు బడుల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ సన్నద్ధం చేస్తున్నారు.

భవిష్యత్‌కు పునాది..

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది పదో తరగతి. గతంలో పది పరీక్షలకు 11 పేపర్లు ఉండగా గత రెండేళ్ల నుంచి ప్రభుత్వం 7 పేపర్లుగా కుదించింది. ఒక్కో పేపర్ పరీక్ష నిర్వాహణ సమయం 3 గంటలు ఉంటుంది. ఇందులో బాయాలజీకి, ఫిజిక్స్, కెమిస్ట్రీకి మాత్రమే గంటన్నర చొప్పున ఆయా సబ్జెక్టులకు 3 గంటల సమయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక తరగతులు ఇలా..

విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల పాటు ఒక సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించి మధ్యాహ్నం 3 గంటలకు ఆ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. అదే విధంగా సాయంత్రం 4.30 గంటల నుంచి 6 వరకు.. రోజు మొత్తం రెండున్నర గంటల ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించాలి..

దీంతో ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగే విషయాలను చెబుతూ ఉత్తేజ పరుస్తున్నారు. ఈ ఏడాది ఎవరు పదికి పది మార్కులు సాధిస్తారో వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆసక్తి కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారికి తగిన సలహాలు, సూచనలతో తార్ఫీదు ఇస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యాంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహించి పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు.

విద్యార్థులకు అల్పాహారం..

పది పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల సౌకర్యార్థం అల్పాహారం ఏర్పాటు చేసేందుకు ఈ ఏడాది ప్రభుత్వం నుంచి గ్రాంట్ నిధులు విడుదల కాకపోయినప్పటికీ విద్యార్థులు ఆకలి కేకలతో అలమటించకుండా ఉండేందుకు మండల విద్యాశాఖ చొరవ తీసుకుంది. గత నెల జనవరి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యాన ఉపాధ్యాయులు, దాతలు కొంత మేర నగదు వేసుకోని విద్యార్థులకు అల్పాహారం అందిస్తూ.. సహకరిస్తున్నారు.

ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు..



సర్కారు బడులలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు రోజుకు రెండున్నర గంటల ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి పరీక్షలు పెడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి రానున్న పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

– తమ్మారపు సిద్దార్థ, 10వ తరగతి విద్యార్థి

లక్ష్యం చేరుకోవాలి..



మండలంలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఒక లక్ష్యాన్ని నిర్ణయించాం. ఆ మేరకు లక్ష్యాన్ని చేరుకోవాలని హెచ్ఎంలను ఆదేశించాం. అందుకు తగ్గట్టుగానే ఉపాధ్యాయులు తమ ప్రయత్నాలు చేస్తూ.. ప్రత్యేక తరగతులపై దృష్టి సారిస్తున్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ఈ ఏడాది సర్కారు బడుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంఈఓ, వైరా

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మధిర: సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

వైరా/మధిర: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి యలదండి బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు జి.అశోక్, కందుల అర్జునరావు, వీరబాబు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం వైరాలోని విక్రమ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అదే విధంగా మధిరలో సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆశ కార్యకర్తలు మధిర ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు సమ్మె నోటీస్ అందించారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రతినెల రూ.10వేల పెన్షన్ చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో ఆశ కార్యకర్తలు వేములక్ష్మి, వేల్పుల లీల, గొల్లమందల సుహాసిని, జ్యోతి, శ్రావణి, లక్ష్మి, రాణి, రాజు, రాజశేఖర్ ఉన్నారు.

యూటీఎఫ్ సభకు వెళ్లిన ఉపాధ్యాయులు

కారేపల్లి: ఖమ్మంలో జరుగుతున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలకు కారేపల్లి మండలం నుంచి ఉపాధ్యాయులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కేవీ కృష్ణారావు, బానోత్ మంగీలాల్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, సూర్య, నాగేశ్వరరావు, రాంబాబు, రామకృష్ణ, శిరీష, రామారావు, శివకోటి, సరిత, రామోజీ, రమేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు

కల్లూరు: విద్యానగర్‌లోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఉత్కంఠ భరితంగా జరిగిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వాలీబాల్ పోటీల విజేతలకు శనివారం రాత్రి బహుమతులు అందజేశారు. కల్లూరు మండలం కప్పలబంధం టీమ్ ప్రథమ స్థానంలో గెలువగా.. ఎస్సై షాకీర్ బహుమతి అందించారు. రూ.30,116 నగదు అందజేశారు. రెండో బహుమతి ములకలపల్లి పోలీస్ టీమ్, మూడవ బహుమతి ఖమ్మం, నాల్గో బహుమతి అశ్వారావుపేట టీమ్ గెలుచుకుంది. కార్యక్రమంలో దాతలు భాగం ప్రభాకర్ చౌదరి, మానుకొండ కిరణ్‌కుమార్, పెద్దబోయిన రామనరసింహారావు, పాపబత్తిని నగేష్, దామాల రాజు, నిర్వాహకులు అంబేద్కర్ యూత్ నుంచి దామాల నరేష్, కొండా రామకృష్ణ, నవీన్, రాజు, రాకేష్, మేక మరియన్న, భూక్యా శివకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఖోఖో జట్ల ఎంపిక



జిల్లా ఖోఖో మహిళల జట్టు

కల్లూరు: ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ మహిళల, పురుషుల ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు ఆదివారం కల్లూరులోని మినీ స్టేడియంలో నిర్వహించారు. మహిళల విభాగం నుంచి 50 మంది, పురుషుల విభాగం నుంచి 60 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. వీరిలో 15 మంది పురుషులను, 15 మంది మహిళలను ఖోఖో జిల్లా జట్లుగా ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8,9,10,11 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ వారు నిర్వహించు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య, కంద్రాతి రాధాకృష్ణ, ఎన్.రామారావు, కృష్ణ, పవన్ కుమార్, ప్రసాద్, కల్లూరు గేమ్స్ కమిటీ సభ్యులు గౌతమ్‌రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం విజయవంతం



భీమవరంలో పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్లు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, గంటుపల్లి గోపవరం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పశు వైద్యశిబిరాలు విజయవంతమయ్యాయి. జాతీయ సేవా పథకంలో భాగంగా పశువైద్య కళాశాల రాజేంద్రనగర్, పశుసంవర్థక శాఖ ఖమ్మంవారి ఆధ్వర్యంలో ఈ శిబిరాలను ఏర్పాటు చేయగా, ఈ కార్యక్రమాన్ని ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ శిబిరాల్లో140 పశువులకు ఎదపరీక్షలు, 45 పశువుల అనారోగ్య సమస్యలకి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 130 పశువులకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా.ప్రదీప్ కుమార్ పశువైద్యాధికారులు వంశీ, డాక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీసత్యసాయి సేవా సమితిలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో డాక్టర్ వి.తిరుపతయ్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ప్రభుత్వాస్పత్రి రోగులు, యాచకులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తూము ప్రకాశ్‌రావు జ్ఞాపకార్థం మేఘశ్రీ ఆస్పత్రి వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి వ్యాధులకు సంబంధించిన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయికుమార్, సూతగాని శ్రీకాంత్, బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తూము రోషన్ కుమార్, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండలరావు, సీపీఐ మండల కార్యదర్శి ఆనందరావు, నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన



రేజర్లలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల పంచాయతీలో రూ.96 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల ప్రభాకర్, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి, కమణతరెడ్డి సత్యనారాయణరెడ్డి, కాసర్ల రాంబాబు, ఇండ్ల శ్రీను, కలీల్ రహమాన్, మద్దెల శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేయండి..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈ నెల 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కోరారు. గతంలో ఓటర్లు అయినప్పటికీ ఓటు హక్కు కోసం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే



మేడారం సమ్మక్క గద్దెల వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదివారం మేడారం సమ్మక్క, సారక్క దేవతలను దర్శించుకున్నారు. ఈ నెల 22 నుంచి మేడారం జాతర మొదలవుతున్న సందర్భంగా ఆయన వైరా నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నాయకులతో కలిసి సమ్మక్క, సారాలమ్మ గద్దెలను దర్శించుకుని పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవార్లను మొక్కినట్లు తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు,

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

ముదిగొండ: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని రైతుసంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్ కోరారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం కల్యాణ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతుందని విమర్శించారు. సమావేశంలో రైతుసంఘం మండల అధ్యక్షుడు కందుల బాస్కర్‌రావు, నాయకులు నెమలి సైదులు, ఉపేందర్, శ్రీను, మధార్‌సాహెబ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించం



సత్తుపల్లి: మాట్లాడుతున్న సొసైటీ వైస్ చైర్మన్ చెన్నారావు



తల్లాడ: సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

సత్తుపల్లి/తల్లాడ: ప్రజలు ఇచ్చిన తీర్పును భరించలేకపోతున్నారు.. నిండా రెండు నెలలు కూడా కాలేదు.. అప్పుడే మహిళా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిపై విమర్శలు చేయటాన్ని సహించేది లేదని సొసైటీ వైస్ చైర్మన్ గాదె చెన్నారావు, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి మండిపడ్డారు. సత్తుపల్లిలోని స్థానిక ఎమ్మెల్యే నివాసంలో, తల్లాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే రాగమయిపై అవాకులు చవాకులు పేలితే మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలపై తిరుగుబాటు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా పని చేసినా మిమ్మల్ని ఏనాడు అగౌరవ పర్చలేదు.. కించపర్చలేదని.. అంటువంటిది మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా ప్రజల తీర్పును గౌరవించకుండా విమర్శలు చేయటం దారుణమన్నారు. 2018లో కాంగ్రెస్ ఓట్లతో గెలిచి కనీసం కాంగ్రెస్ కార్యకర్తలకు మాటమాత్రం చెప్పకుండా టీఆర్ఎస్‌లో చేరినా.. మిమ్మల్ని ఒక్కమాట కూడా అనకుండా ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలిచామన్నారు. రేజర్ల ఉపసర్పంచ్ భీమిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.100 కోట్లతో పనులు చేపట్టారని, గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి నిధులు మంజూరు లేకపోయినా కాగితాలమీద చూపించి ఎన్నికల రాజకీయం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పనులు ఆగవనీ, రాజకీయంగా ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. అధికారం కోల్పోయి జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడితే తాము గ్రామాల్లో నిలదీయాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, మండల పార్టీ అధ్యక్షుడు శివవేణు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, పసుమర్తి చంద్రరావు, ఉడతనేని అప్పారావు, బండి గుర్నాధరెడ్డి, కె.ప్రభాకర్‌రావు, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుధాకర్, తల్లాడ పట్టణ అధ్యక్షుడు దగ్గుల నాగిరెడ్డి, నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, వీరారెడ్డి, రామారావు, శ్రీనివాసరావు, జోసఫ్, మల్లిఖార్జున్‌రావు, కోటిరెడ్డి, నాగన్న, కిరణ్, బాలాజీ నాయక్, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సత్తుపల్లిటౌన్: మాట్లాడుతున్న వీరాంజనేయులు

మధిర/సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులను కలుసుకుందాం.. సమస్యలు తెలుసుకుందాం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి మధిర డిపోను, ఆదివారం సత్తుపల్లి డిపోను ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు సందర్శించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను తెలుసుకొని యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిపోలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1200 కోట్ల క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, కార్యదర్శి వెంకటేశ్వర్లు, పద్మావతి, రాంబాబు, సుధాకర్, గోపాలకృష్ణ, వెంకన్న, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి జి.లింగమూర్తి, రీజినల్ సెక్రటరీ సుధాకర్, రీజినల్ అధ్యక్షుడు బి.రాంబాబు, డిపో నాయకులు సీహెచ్‌వీకే రెడ్డి, శంకర్, ప్రభాకర్, జగన్నాథం, వెంకటయ్య, స్వామి, బీవీఎస్ రెడ్డి, ఎస్‌పీ రావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు



సత్తుపల్లిలో కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లి/ మధిర/ వేంసూరు/ పెనుబల్లి/ కల్లూరు: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి పట్టణంలోని రింగ్ సెంటర్లో మట్టా దయానంద్, మధిరలోని స్థానిక మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో, వేంసూరులోని మర్లపాడులో, పెనుబల్లిలోని వీయంబంజర్ ఆర్‌కే.ఫంక్షన్ హాల్‌లో, కల్లూరులో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధిరలో మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. యువనేత యుగంధర్ భవిష్యత్‌లో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివవేణు, నర్సింహారావు, సుజలారాణి, కమల్‌పాషా, అప్పారావు, డాక్టర్ నర్సింహారావు, ప్రసాద్, రాంబాబు, సంధీప్‌గౌడ్, వినుకొండ కృష్ణ, కె.ప్రభాకర్‌రావు, రాఘవరెడ్డి, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్‌రావు, సోమరాజు సీతారామారావు, వియంబంజర్ ఎంపీటీసీ ఝాన్సీ నిరంజన్, వెంకటేశ్వరరావు, చిన్నస్వామి, రామారావు, కాంతయ్య, మాధవరావు, భూపాల్‌రెడ్డి, నిరంజన్, కరీముల్లా, మొండితోక సుధాకర్, చెరుకూరి నాగార్జున, రామారావు, రమేష్, కోటేశ్వరరావు, రామరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శ్రీను



అటవీ ఉద్యోగుల డివిజన్ నూతన కార్యవర్గం

సత్తుపల్లిటౌన్: తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ సత్తుపల్లి డివిజన్ యూనిట్ అధ్యక్షుడిగా తల్లాడ డీఆర్ఓ బి.శ్రీను, ప్రధాన కార్యదర్శిగా లోకారం ఎఫ్‌బీఓ ఎల్.రాంబాబు ఎన్నికయ్యారు. సత్తుపల్లిలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పెరికికుంట ఎఫ్‌బీఓ ఎం.భరత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భవన్నపాలెం ఎఫ్ఎస్ఓ వి.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీగా తురకలగూడెం ఎఫ్‌బీఓ వి.సాంబయ్య, కోశాధికారిగా కల్లూరు ఎఫ్‌బీఓ అజంఅలీ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా వరంగల్ సర్కిల్ ప్రతినిధులు బి.సాంబు, మురళీకృష్ణ, విష్ణువర్ధన్, విక్రమ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది. ఈ నూతన కార్యవర్గాన్ని ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల అభినందించారు.


గ్రామీణ వైద్యులను గుర్తించాలి

ఏన్కూరు: ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి గుర్తింపు ఇవ్వాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు కోరారు. మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం గ్రామీణ వైద్యుల సంఘం మండల సమావేశం జరిగింది. మండల గ్రామీణ వైద్యుల సంఘం నూతన కమిటీని ఎన్నికోగా.. అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా మధు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గరిడేపల్లి వెంకటరామయ్య, వాసుదేవరావు, కొండలరావు, నాగేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడి ఎన్నిక

తల్లాడ: పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కల్లూరు డివిజన్ అధ్యక్షుడిగా తల్లాడకు చెందిన సీహెచ్.వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం కల్లూరు, ఏన్కూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో జరిగిన కల్లూరు డివిజన్ నాలుగో తరగతి సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి, జిల్లా అధ్యక్షుడు ఎండి.పాషా, ప్రధాన కార్యదర్శి తుపాకల కాశయ్య సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడిగా ఖాదర్‌బాబా, శ్రీరామ్, నరేష్, కార్యదర్శిగా భూక్యా ప్రవీణ్, సంయుక్త కార్యదర్శిగా ఎస్‌కె. లాల్, కోశాధికారిగా శ్రీనివాసరావు, కల్లూరు డివిజన్ మహిళా అధ్యక్ష, కార్యదర్శులుగా శైలజ, కృష్ణవేణిలను ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి



జూట్, క్లాత్ సంచుల తయారీ కేంద్రాన్ని సందర్శించిన కొండయ్య

మధిరరూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలని సామాజిక సేవకులు లంకా కొండయ్య అన్నారు. అల్లీనగరం గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి బాబురావు తన కుమారుడి సహకారంతో ఏర్పాటుచేసిన జూట్, క్లాత్ సంచుల తయారీ పరిశ్రమ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఖరీదుతో జూట్, క్లాత్ సంచులను సుదూర ప్రాంతాలకు తరలించడం అభినందనీయమని.. అందరూ ప్లాస్టిక్‌ను నిరోధించి వస్త్ర సంచులను ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిమడుగులు, కుంటలు, చెరువులు, నదుల్లో వేయకూడదని తెలిపారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు చెత్తకుప్పలతో కాల్చగా, ఆ పొగను పీల్చిన ప్రజలకు కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం కొన్ని క్లాత్, జూటు బ్యాగులను నిరుపేదలకు అందజేశారు.